

అమ్మాయిలదే హవా..

'పది'లో ప్రతిభ కనబర్చిన బాలికలు

- జిల్లాలో 91.49 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 27వ స్థానంలో 'భద్రాద్రి'
- ఈనెల 16 వరకు సప్లిమెంటరీ ఫీజు చెల్లించే అవకాశం

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలే అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారు. బుధవారం విడుదలైన ఈ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా 27వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోల్చితే 1.10 శాతం ఉత్తీర్ణత పెరిగినా.. రాష్ట్ర స్థాయిలో ఒక స్థానం కిందకు పడిపోయింది. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మొత్తం 12, 250 మంది పరీక్షలు రాయగా, 11,208 (91.49 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 5,971 మందికి 5,320, బాలికలు 6,279 మందికి 5,888 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలు 4.67 శాతం అధిక ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ ఏడాది జిల్లాలో 299 పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 78 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వాటిల్లో ప్రభుత్వ పాఠశాలు 54, ప్రైవేట్ పాఠశాలలు 24 ఉన్నాయి. ఇక విద్యారులంతా ఫెయిలైన పాఠశాలలు ఏమీ లేవు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడుతున్నా.. రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాలు రావడం లేదని, దీనిపై విద్యాశాఖాధికారులు సమీక్షించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తుండగా వారంతా అందుబాటులో ఉంటారని, ఈ నేపథ్యంలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అంటున్నారు. కాగా, ఉత్తీర్ణత కాలేకపోయిన వారు నిరుత్సాహపడొద్దని, సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమై ఉత్తీర్ణత సాధించాలని విద్యాధికారులు సూచిస్తున్నారు.

15 వరకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్..

పదో తరగతి ఫలితాల్లో ఎక్కువ మార్కులు వస్తాయని అనుకుంటే తక్కువ వచ్చిన వారు, పరీక్షలు బాగా రాశామనుకుంటే ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 15 వరకు అవకాశం ఇచ్చారు. ఇక సప్లిమెంటరీ పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా 16వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు.

'ఆశ్రమాల్లో' పెరిగిన ఫలితాలు

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి ఫలితాలు ఆశాజనకంగా వచ్చాయి. గతేడాది కంటే కొంత ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఆశ్రమ పాఠశాలల్లో 93.77, హాస్టళ్లలో 84.34 శాతం ఫలితాలు నమోదయ్యాయి. మొత్తం 2,173 మందికి 2,022 మంది ఉత్తీర్ణత సాధించగా 151 మంది ఫెయిలయ్యారు. గతేడాది 90.60 శాతం ఫలితాలు సాధించగా ఈ ఏడాది 93.05 శాతానికి పెరిగింది. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 31 మందికి అందరూ ఉత్తీర్ణులయ్యారని పీఓ రాహుల్ తెలిపారు. ఇల్లెందు ఆశ్రమ పాఠశాలలో అతి తక్కువగా 65.22 శాతం ఉత్తీర్ణత నమోదైందని వెల్లడించారు.

కన్నీటితో హాజరై.. ఉత్తమ ఫలితాలు

పరీక్షల ప్రారంభం రోజే బాలికల తండ్రి మృతి


హర్షిత


ప్రియ

ఇల్లెందురూరల్: తండ్రి మృతితో పుట్టెడు దుఃఖంలో ఉండి.. కన్నీటిని దిగమింగుతూ పదో తరగతి పరీక్షలు రాసిన అక్కాచెల్లెళ్లు బుధవారం వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని కల్తిరామయ్య గుంపు గ్రామానికి చెందిన కనపటి హర్షిత, ప్రియ రొంపేడు ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. పరీక్షలు ప్రారంభమైన రోజే తండ్రి వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ వార్త కూతుర్లకు తెలియనీయకుండా జాగ్రత్త పడిన కుటుంబ సభ్యులు, ఆశ్రమ ఉపాధ్యాయులు.. పరీక్ష పూర్తి కాగానే ఇంటికి తీసుకెళ్లి తండ్రి భౌతిక కాయాన్ని చూపించారు. ఆరోజు అంత్యక్రియలు పూర్తి కాగా, అందరూ ధైర్యం చెప్పి మిగితా పరీక్షలు కూడా రాయించారు. కాగా హర్షిత 355, ప్రియ 388 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పక్కన ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

పాల్వంచరూరల్ : భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పెద్దమ్మగుడి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ చట్టం ప్రకారం రైతుల అనుభవంలో ఉన్న భూముల వివరాలను పొందుపర్చుకోవాలని, ప్రతి రెవెన్యూ కార్యాలయంలో సంబంధిత అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రైతులు చేసుకున్న సాదాబైనామాలను తిరిగి భూ భారతి యాప్‌లో పొందుపరుస్తామన్నారు. పాల్వంచ ప్రాంతంలోని 999, 444, 817, 727 సర్వే నంబర్లలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని, నిబంధనల ప్రకారం భూ సమస్యలు పరిష్కరిస్తారని వెల్లడించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతి రైతును భూ హక్కుదారుడిగా గుర్తించాలని కోరారు. ధరణిలో జరిగిన తప్పులు ఇందులో పునరావృతం కాకుండా పారదర్శకంగా సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సదస్సులో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, ఆర్డీఓ మధు, తహసీల్దార్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకోవాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బసవేశ్వరుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వ గురు మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు బలంగా ఉన్న ఆ రోజుల్లోనే తన బోధనలతో ప్రజలను చైతన్యం చేశారని అన్నారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని కీర్తించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, బీసీ సంక్షేమాధికారి బి.ఇందిర, డీఏఓ బాబురావు, తూనికల, కొలతల అధికారి మనోహర్, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.









క్లుప్తంగా

తాపీమేస్త్రీ కుమార్తె స్కూల్ టాపర్



ఉషారాణి

పాల్వంచరూరల్: తాపీమేస్త్రీ కూతురు పదో తరగతిలో ప్రతిభ చాటింది. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన మాళోతు రవి తాపీమేస్త్రీగా పనిచేస్తూ తన ముగ్గురు పిల్లలను చదివిస్తున్నాడు. ఇద్దరు కుమారులు ప్రస్తుతం ఐటీఐ చేస్తుండగా, కుమార్తె ఉషారాణి స్వగ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతి చదివింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 600మార్కులకు 523 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేత్రపర్వంగా కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అకాల వర్షంతో పంట నష్టం

మణుగూరు టౌన్/పాల్వంచరూరల్/ములకలపల్లి : అకాల వర్షంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. జిల్లాలోని పలుచోట్ల బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మణుగూరు, పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం, గుండాల, టేకులపల్లి, ఇల్లెందు, చంద్రుగొండ మండలాల్లో వర్షం కురవడంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. రైతులు ఉరుకులు, పరుగులతో వెళ్లి పట్టాలు కప్పుకుని ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఈదురు గాలుల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మణుగూరులో వడగండ్ల వాన పడింది.

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించే గడువును ప్రభుత్వం ఈనెల 3వ తేదీ వరకు పొడిగించింది. ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీ కల్పిస్తూ రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31వ తేదీతో గడువు ముగియగా, ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. మరోసారి మూడు రోజులపాటు పొడిగిస్తూ ప్రభుత్వ కార్యదర్శి టీ.కే.శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, రూ.50.13 కోట్ల ఫీజు వసూళ్లతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలో మూడో స్థానాన నిలిచింది. ప్రస్తుతం గడువు పొడిగించిన నేపథ్యాన కేఎంసీతో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల నుండి మరింత ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

5 నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

అశ్వారావుపేటరూరల్: వానాకాలం సాగుకు సంబంధించి రైతులను సమాయత్తం చేసేందుకు ఈ నెల 5వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన విద్య పటిష్టతకు చర్యలు

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. బుధవారం పీఓ తన చాంబర్‌లో అకడమిక్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి, విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు, టీచర్లకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులతో వ్యక్తిగతంగా మాట్లాడి, విద్యా కమిటీ సభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు మణెమ్మ, రమణయ్య, సత్యనారాయణ,రమ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని పీహెచ్‌సీలకు వచ్చే రోగులు, గర్భిణుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలని చెప్పారు. రాత్రి సమయంలో గైనకాలజిస్టులు అందుబాటులో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యాధికారులు జయలక్ష్మి, చైతన్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ తెలిపారు. డిగ్రీ కళాశాలల అడ్మిషన్ల ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్సీవో నాగార్జున రావు, కళాశాలల ప్రిన్సిపాల్స్ రజిత, రజిని, స్పందన, సంగీత, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

భద్రాచలం: చేయని తప్పునకు తొలగించిన తనను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరుతూ భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో స్వీపర్‌గా పని చేసిన మంగమ్మ అనే మహిళ బుధవారం ఈఓ చాంబర్ ఎదుట బైఠాయించింది. విధుల్లో ఉన్న సమయంలో చోరీ పేరుతో తనను తొలగించారని, రెండేళ్లయినా తిరిగి తీసుకోలేదని ఆరోపించింది. ఈఓ భద్రాచలంలో లేరని, రాగానే ఆమె దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని దేవస్థానం ఈఈ రవీందర్, పోలీసులు నచ్చజెప్పడంతో బాధితురాలు ఆందోళన విరమించింది.

పశువుల వాహనాలు స్వాధీనం

బూర్గంపాడు: అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న ఆటోలను బుధవారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. రెండు ట్రాలీ ఆటోల్లో పశువులను తరలిస్తుండగా తాళ్లగొమ్మూరులో పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. ఐదుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



రసాభాసగా కాంగ్రెస్ సమావేశం



సమావేశాన్ని అడ్డుకుంటున్న కార్యకర్తలు

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ జిల్లాస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో రసాభాస నెలకొంది. సమావేశాన్ని అర్ధంతరంగా ముగించి, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు మాట్లాడకుండానే వెళ్లిపోయారు. బుధవారం వజ్రా హోటల్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల అంతర్గత సమావేశం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీపీసీసీ పరిశీలకులు శ్రావణ్ కుమార్ రెడ్డి, పి.ప్రమోద్, భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ తదితరులు హాజరయ్యారు. టీపీసీసీ పరిశీలకులు మాట్లాడాక ముఖ్యనేతలు మాట్లాడుతుండగా కార్యకర్తలు అడ్డుకున్నారు. పార్టీకి సంబంధం లేని వ్యక్తులు, అధికారం రాగానే ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు పెత్తనం ఏంటని ప్రశ్నించారు. కష్టపడ్డ నాయకులకు ఎక్కడా చోటు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దమ్మగుడి పాలక మండలిలో స్థానికులు, కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి చోటు ఇవ్వకుండా నాయకులే మోసం చేశారని గంధం నరసింహారావు అనే కార్యకర్త ఆరోపించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను బాయికాట్ చేస్తామని పేర్కొన్నారు. మరికొందరు సైతం మాట్లాడుతూ ఇతర పార్టీల వారికి కండువాలు కప్పడంతో, వారి పెత్తనం కింద పనిచేయాల్సి వస్తుందని గొడవకు దిగారు. దీంతో కొంత కాలంగా ఉన్న వర్గ విభేదాలు బహిర్గతమైనట్లయింది. కాగా సంయమనం పాటించాలని డీసీసీ అధ్యక్షుడు, పరిశీలకులు కోరారు. కార్యకర్తల అభిప్రాయాలు తీసుకుంటామని చెప్పినా శ్రేణులు శాంతించకుండా అడ్డుకోవడంతో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, ధర్మారావు, భూక్యా దళ్‌సింగ్, జేబీ శౌరి, దేవీ ప్రసన్న, యడవల్లి కృష్ణ, కొత్వాల శ్రీనివాసరావు, నూకల రంగారావు, కార్తీక్, వై.ముత్తయ్య, జలీల్ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో 'త్రివేణి' హవా

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు అత్యధిక మార్కులతో విజయదుందుభి మోగించారని త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి ఓ ప్రకటనలో వెల్లడించారు. అన్ని బ్రాంచ్‌ల్లో తమ విద్యార్థులు 600కు 593 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే, 593, 590, 587, 587, 587, 586, 586, 586, 586, 584, 583, 583, 583, 582, 582, 581, 581, 581, 581, 580, 580, 580 మార్కులతో అగ్రగామిగా నిలవగా.. 570కి పైగా 61మంది విద్యార్థులు, 550 మార్కులకు పైగా 200మంది, 500కు పైగా మార్కులు 686 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. గ్రేడ్ల విధానంలోనైనా, ఇప్పుడు మార్కుల విధానంలోనైనా తమ విద్యార్థులకు తిరుగులేదని, వంద శాతం ఉత్తీర్ణతతో మరోసారి తెలంగాణలో మొదటి స్థానం దక్కించుకున్నామని వెల్లడించారు. హైదరాబాద్, ఖమ్మం, కొత్తగూడెం బ్రాంచ్‌ల్లో విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష, ధర్నా నిర్వహించారు. అనంతరం సింగరేణి డైరెక్టర్ (పా) కే. వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేతనాలు పెంచుతామంటూ సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం 14 నెలల నుంచి కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో కూడా వేతనాల పెంపుపై చర్చించలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు మల్లెల రామనాథం, ఏజే రమేష్, ఆర్ మధుసూదన్ రావు, కాపు కృష్ణ, ఎం.శ్రీనివాస్, విశ్వనాథ్, పెద్దబోయిన సతీష్, బి.మధు, ఎస్కే యాకూబ్‌షావలి, యాకయ్య పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీ



ఇందిరానగర్ కాలనీ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో తనిఖీ చేస్తున్న అధికారి


పాల్వంచరూరల్: మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో ఉన్న పెట్రోల్ బంక్‌లో బుధవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీచేశారు.దంతెలబోరుగ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడురూ.150తో ఎక్స్‌ట్రామైలేజ్ పెట్రోల్‌ను తన ద్విచక్రవాహనంలో కొట్టించుకుని కిలోమీటర్ దూరం వెళ్లగానే బైక్ ఆగిపోయింది. మెకానిక్ షెడ్‌కు తరలించి చూపగా, పెట్రోల్‌లో నీళ్లు కలిసినట్లు తేలింది. దీంతో బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేయగా, తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ వచ్చి పెట్రోల్ బంక్‌లో తనిఖీ చేసి వెళ్లారు.

మణుగూరులో 117 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దుర్గం రాంచందర్

మణుగూరుటౌన్: ఏరియాలో ఏప్రిల్‌లో 9.26 లక్షల టన్నుల లక్ష్యానికి 10.88 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 117 శాతం నమోదు చేసినట్లు మణుగూరు జీఎందుర్గంరాంచందర్‌తెలిపారు.బుధవారనిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్‌లో ఓబీ 15 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను13.33లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీశామన్నారు. మణుగూరు ఓసీ విస్తరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాస్, శ్రీనివాసచారి, అనురాధ, శేషగిరి, బాబుల్ రాజు, రమేశ్, సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.





వేధింపులు తట్టుకోలేక వివాహిత నిరసన

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన మహిళ రాజేశ్వరి తన ఇద్దరు పిల్లలతో బుధవారం రోడ్డు మీద నిరసన చేపట్టింది. కొంత కాలంగా భర్త అనిల్, అతని తల్లి విజయలక్ష్మి, చెల్లి అనూష, బావ సురేష్ మాటలు వింటూ అకారణంగా దూషిస్తున్నాడని, మానసికంగా, శారీరకంగా మనోవేదనకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. ఈ క్రమంలో భద్రాచలం ఎస్ఐ స్వప్న ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తానని చెప్పినా బాధితురాలు ఆందోళన వీడలేదు. కాగా బాధితురాలి భర్త, కుటుంబ సభ్యులను ఎస్ఐ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు.

న్యాయవాదులకు శిక్షణ

కొత్తగూడెంటౌన్: యువ న్యాయవాదులు పరిజ్ఞానం పెంపొందించుకుని వృత్తిలో రాణించాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. బుధవారం కొత్తగూడెం కోర్టులోని లైబ్రరీ హాల్‌లో న్యాయపదజాలంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలోమాట్లాడారు. జే.గోపికృష్ణ, భాగం మాధవరావు, కాసాని రమేష్, ఉప్పు అరుణ్, కె.చిన్నికృష్ణ, మాలోతు ప్రసాద్ పాల్గొన్నారు.



సాక్షి ఫ్యామిలీ IV
ఖమ్మం
గురువారం ॥ 1-5-2025

సమ్మర్ సమతుల్యత

డైట్ ప్లాన్
నిర్వహణ: నిర్మలా రెడ్డి

అ... అమ్మ ఆ... ఆహారం

వయసుల వారీగా డైట్ చక్ర

టీనేజ్, యవ్వనం, గర్భధారణ, పిల్లలకు పాలు ఇవ్వడం, మెనోపాజ్, వయసు పైబడటం.. వంటి దశల ఆధారంగా పోషక అవసరాలు మారుతుంటాయి. కానీ, మన ఇళ్లలో సాధారణంగా అందరికీ ఒకేతరహా వంటను వండుతుంటాం. దీనివల్ల వయసుల వారీగా సరైన పోషకాలు శరీరానికి అందక, శక్తి సన్నగిల్లుతుంది. దీంతో చురుకుదనం తగ్గుతుంది. ఫలితం చేసే పనులపై ప్రభావం చూపుతుంది. అందుకని పోషకాహార చక్రం ఎవరికి వారు, వయసుల వారీగా ఆరోగ్యదాయకంగా మార్చుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి.



రోజూ ఉదయం నుంచి వంటింట్లో చెమటలు కక్కుతూ వంటకాలతో కుస్తీ పడుతుంటుంది అమ్మ. 'నీరసంగా ఉంటోంది.. ఏ పనీ చేయాలనిపించడం లేదు' అని అంటూనే లేని ఓపికను తెచ్చుకొని పనులు చేస్తూనే ఉంటుంది. 'కాళ్ల నొప్పులు.. కదలనివ్వడం లేదు' అంటూ కూర్చున్న చోటు నుంచి లేవలేకపోతుంటుంది బామ్మ. కాలేజీ నుంచి వస్తూనే 'బ్యాగ్ కూడా మోయలేను.. అలసటగా ఉంది' అంటూ సోఫాలో కూలబడిపోతుంది కూతురు. రోజూ మూడుపూటలా తింటూనే ఉన్నాం, అయినా ఎందుకిలా?! ఏ ఆరోగ్య సమస్యనో అని వైద్యులను కలిస్తే 'పోషకాహారం తీసుకోండి' అని చెబుతుంటారు. మన శరీరానికి ఏయే పోషకాలు అవసరం, సీజన్‌కి తగినట్టు మన ఆహారపు అలవాట్లను ఎలా మార్చుకోవాలి. సింపుల్‌గా హెల్తీ వంటకాలను ఎలా తయారు చేసుకోవచ్చు... ఈ వివరాలతో వరుస కథనాలు

1 బాల్యం నుంచి యవ్వనం (8-18 ఏళ్లు) వరకు

శరీరం వృద్ధి చెందడానికి, హార్మోన్ల సమతుల్యతకు, ఎముకల బలానికి ... పాల ఉత్పత్తులు, బాదం, ఆకుకూరలు, గుడ్లు, పప్పులు, మటన్, చికెన్, బచ్చలి, బ్రొకోలి, బీట్‌రూట్.. మొదలైన ఐరన్ నిచ్చే పదార్థాలు ఈ వయసుకు కీలకం.

బ్రేక్‌ఫాస్ట్: ఉప్మా/పొంగల్/ ఇడ్లీ.. + ఒక గుడ్డు + గ్లాస్ పాలు
మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్/ రోటీ (2)+ పప్పు, ఆకుకూర, బీన్స్, పెరుగు
సాయంత్రం స్నాక్స్: బాదం/జీడిపప్పు/ఇతర డ్రై ఫ్రూట్స్‌తో చేసిన స్నాక్స్ (చిన్న మోతాదులో)+ అరటి పండు
రాత్రి భోజనం: రోటీ (2) లేదా మినప పిండితో చేసిన అట్టు +ఏదైనా కూరగాయ + నిమ్మరసం కలిపిన వెజ్ సలాడ్



2 యువతులకు (19-30 ఏళ్లు)

రుతుక్రమం చురుకుగా ఉండటం, సంతానోత్పత్తి ప్లానింగ్‌కి సరైన సమయం. ఈ దశలో...
ఐరన్ – ఫోలేట్ సమృద్ధిగా లభించే ఆకుకూరలు, అరటి మొదలైనవి తినాలి. ఒమేగా-3 యాసిడ్స్ ఉండే ఫ్లాక్స్ సీడ్స్, చేపలు, వాల్‌నట్స్‌ను కూడా చేర్చుకోవాలి.. పీచుపదార్థాలు ఉండే గోధుమ, కూరగాయలు, జామ వంటి పండ్లు తినాలి. కాల్షియం కోసం పాలు, పెరుగు, టోఫు వంటివి తీసుకోవాలి. జింక్ సమృద్ధిగా లభించే చిక్కుళ్లు లాంటివి.. ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.



మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించి సమతులాహారం తీసుకోవడంలో జాగ్రత్తలు పెరిగాయి. కానీ, మన రొటీన్ ఫుడ్ మాత్రం అలాగే ఉంటోంది. హార్మోన్ల సమతుల్యతకు, శక్తికి తినే ఆహారం చాలా ముఖ్యమైనది. సాధారణంగా మహిళలు తీసుకునే ఆహారంలో ఉండాల్సినవి ఐరన్, కాల్షియం, విటమిన్లు, ప్రొటీన్లు.

శక్తికి ఇనుము... రక్తంలో ఐరన్ శాతం తగ్గితే బలహీనం అవుతారు. త్వరగా అలసిపోతారు. రక్తస్రావం అధికం అవుతుంది. తలనొప్పి, జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. బచ్చలి, పాలకూర, తోటకూర. గోంగూర వంటి ఆకుకూరలు, బీట్‌రూట్, చిక్కుళ్ళు, శెనగ, మటన్, పెసలు, నట్స్, ఎండు ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష, తృణధాన్యాలు, గుడ్లు.. వంటివి శరీరంలో ఐరన్ శాతం పెరగడానికి సహాయపడతాయి. ఒక వ్యక్తి రోజువారీగా అవసరమైన ఐరన్ మోతాదు వారి వయసు, జెండర్‌పై ఆధారపడి ఉంటుంది. గర్భిణులు, బాలికలకు రోజూ 18 మిల్లీగ్రాముల ఐరన్ అవసరం. దీంతో పాటు విటమిన్ – సి ఉండే నారింజ, బత్తాయి వంటి సిట్రస్ పండ్లు, రసాలు తీసుకోవడం వల్ల ఒంట్లో ఇనుము శోషణ పెరుగుతుంది.

3 గర్భధారణ సమయంలో...

పిండం అభివృద్ధికి, తల్లి శక్తికి తీసుకోవాల్సినవి...
డాక్టర్ సలహాతో సప్లిమెంట్స్ + ఆకుకూరలు, నువ్వులు, దాల్చిన చెక్క, ప్రొటీన్ల కోసం గుడ్లు, పప్పులు, చికెన్, కాల్షియం – విటమిన్-ఇ కోసం పాల ఉత్పత్తులు, ఫైబర్‌కి పండ్లు, బ్రౌన్ రైస్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌కి చేపలు, ఫ్లాక్స్ సీడ్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: గోధుమ రవ్వ/ ఓట్స్ ఉప్మా+ అరటి పండు + గ్లాసుడు పాలు
లంచ్: బ్రౌన్ రైస్ /రోటీ (2) / మెంతికూర పప్పు/ పెసరపప్పు+ బెండకాయ కూర, పెరుగు + కారట్/కీరా సలాడ్
సాయంత్రం స్నాక్స్: బాదం/వాల్‌నట్ (4 -5) +అరటిపండు / సపోటా
డిన్నర్: రొట్టెలు (2) / మినప దోస, బీన్స్ / సొరకాయ కూర + గ్లాస్ మజ్జిగ.



పాల ఉత్పత్తులతో కాల్షియం...
ఎముకల బలానికి,,, ప్రత్యేకంగా మెనోపాజ్ దశలో కాల్షియం అవసరం అధికం. అందుకు పాల ఉత్పత్తులు, బాదం, శనగలు, కాలీఫ్లవర్ .. వంటివి తినాలి. ● గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో ఫోలిక్ యాసిడ్ అవసరం ఎక్కువ. ఆకుకూరలు, మాంసం, దాల్చిన చెక్క.. వంటి వాటి నుంచి ఫోలిక్ యాసిడ్ లభిస్తుంది ● ఒమేగా-3 ఫ్యాటి యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హార్మోన్ల సమతుల్యతకు ఉపయోగ పడతాయి. ఫ్లాక్స్ సీడ్స్, వాల్‌నట్స్, చేపల నుంచి ఈ ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి ● శరీర బలానికి, కండరాల పెంపుకు ప్రొటీన్లు చాలా అవసరం. మినపపప్పు, చికెన్, గుడ్లు, నట్స్... నుంచి ప్రొటీన్లు లభిస్తాయి ● జీర్ణ వ్యవస్థ సజావుగా పనిచేయడానికి ఫైబర్ చాలా అవసరం. గోధుమ, మొక్కజొన్న, పండ్లు, కూరగాయల నుంచి లభిస్తుంది.



- డా.బి. జానకి
పోషకాహార నిపుణులు

4 పాలిచ్చే తల్లులు

తగినంత శక్తిని తిరిగి పొందడానికి, పాల వృద్ధికి తీసుకోవాల్సినవి.. ఆకుకూరలు, బ్రొకలీ, కాలీఫ్లవర్, పండ్లు, లేత మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు, బీన్స్ తల్లులకు ప్రొటీన్ అందిస్తాయి. పాల ఉత్పత్తులు, నువ్వులు, ఆహారం జీర్ణం అవడానికి పల్చని మజ్జిగ మొదలైనవి తీసుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: పెసరట్లు, అల్లం పచ్చడి+గ్లాసుడు పాలు/రాగి జావ
లంచ్: బ్రౌన్ రైస్+ మటన్/ చికెన్‌కర్రీ, మెంతికూర పప్పు, పెరుగు, గోంగూర పచ్చడి. **సాయంత్రం స్నాక్స్:** జీరా రసం + బాదం/మెంతి లడ్డు, ఏదైనా ఒక పండు. **డిన్నర్:** రోటీ (2)/మినప రొట్టె, పల్లీలు, బచ్చలి కూర రాత్రి పడుకునే ముందు (ఒంటిగంట లోపల) గ్లాస్ నీళ్ల లేదా చిటికెడు పసుపు కలిపిన గోరువెచ్చని పాలు. బాగా ఆకలిగా అనిపిస్తే అర టేబుల్ స్పూన్ గుమ్మడికాయ గింజలు.

5 మెనోపాజ్ దశ

45 ఏళ్లు పైబడిన మహిళలు ప్లాన్ చేసుకోదగిన పోషకాహారంలో హార్మోన్ల సమతుల్యత, ఎముకల బలం, కొలెస్ట్రాల్ నియంత్రణ పై దృష్టి పెట్టాలి. కాల్షియం – విటమిన్-ఇ కోసం పాల ఉత్పత్తులు, సోయా, టోఫు వంటివి తీసుకోవాలి. చేపలు, ఫ్లాక్స్ సీడ్స్, పీచుపదార్థాలు ఉండే కూరగాయలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే బెర్రీస్, నాటు, తాటి బెల్లం, గ్రీన్ టీలను చేర్చుకొని చక్కెర, ఉప్పు తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి... **బ్రేక్‌ఫాస్ట్: (ఉదయం 8:00 - 9:00):** ఓట్స్ + పాలు + కొద్దిగా వాల్‌నట్ లేదా బాదం (లేదా) రాగి దోస + పెసరపప్పు చట్నీ, ఒక అరటి పండు + గ్లాస్ నీరు. **మధ్యాహ్న భోజనం (లంచ్ - 1:00):** బ్రౌన్ రైస్ లేదా గోధుమ/జొన్న/సజ్జ రొట్టెలు, ఆకుకూరల పప్పు (గోంగూర, తోటకూర వంటివి), దుంపలు కాకుండా దొండకాయ/బీన్స్/బెండకాయ, సలాడ్ (కీరా, గాజర్), పెరుగు. **సాయంత్రం స్నాక్స్ (5:30 - 6:00):** గ్రీన్ టీ లేదా తులసి టీ (షుగర్ లేకుండా) నట్స్ (బాదం, నువ్వులు లేదా ఫ్లాక్స్‌సీడ్స్) (లేదా) ఆపిల్ / పియర్ / సపోటా **రాత్రి భోజనం (డిన్నర్ - 7:30 - 8:00):** గోధుమ రొట్టె (1-2). వెజిటబుల్ సూప్ లేదా తేలికగా జీర్ణం అయ్యే కూర (బెండకాయ, సొరకాయ వంటివి), మజ్జిగ (ఉప్పు తక్కువతో) తీసుకోవాలి.



సమతుల్యత అవసరం

ఓవర్ ఈటింగ్/ తక్కువ తినడం రెండూ సమస్యలు తెచ్చిపెట్టేవే. వ్యక్తి శరీర బరువు, శ్రమను బట్టి డైట్ ప్లాన్ చేసుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి. ప్రతి వ్యక్తికి వారి శరీర బరువు, జీవనశైలి, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా డైట్ చార్ట్ ప్లాన్ చేసుకోవాలి. **ఉదాహరణ:** 50 ఏళ్ల మహిళ డైట్ చార్ట్. ● సమతుల్యత, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉండేటట్లు డైట్ ప్లాన్ చేయాలి. **ప్రత్యేక సూచనలు:** ● రోజూ కనీసం 7,000 – 8,000 అడుగులు నడవాలి / యోగా / లైట్ స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఉప్పు, స్వీట్స్ తక్కువగా వాడాలి ● మెనోపాజ్ దశ కాబట్టి కాల్షియం, విటమిన్-ఇ విషయంలోప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తప్పనిసరి. 15 నిమిషాలు శరీరానికి సూర్యరశ్మి నేరుగా తాకేలా చూసుకోవాలి.

పిల్లలకు చెప్పాల్సిన మాయాబజార్ పాఠాలు



'మీరు ఉద్దండ పండితులేగాని ఉండాల్సిన బుద్ధి మాత్రం లేదయ్యా' అంటాడు శకుని. ర్యాంకులు వేరు... కామన్‌సెన్స్ వేరు... ఈ సంగతి పిల్లలకు ఎవరు చెప్పాలి? 'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి ఉండనే ఉంది' అంటాడు ఇదే శకుని. ఈ చిట్కా చెప్పడానికి పెద్దలకు తీరిక ఎక్కడిది? అస్మదీయులు ఎవరో తస్మదీయులు ఎవరో తెలుసుకోకపోతే పిల్లల అడుగులు పడేదెలా? హాయ్ హాయ్ నాయకా.. హోయ్ హోయ్ నాయకా... నాయకత్వ లక్షణాలు ఎవరికి ఉంటాయి? తెలుగువారికి మాత్రమే ఉన్న వ్యక్తిత్వ వికాస సర్వస్వం 'మాయాబజార్' సినిమా. ఈ సెలవుల్లో పెద్దలు పిల్లలతో ఈ సినిమా చూడాలి. వివరించాలి.



'**మా**యాబజార్' 1957లో విడుదలైన గొప్ప తెలుగు చిత్రం. భారతంలోని పాత్రలకు కొద్దిపాటి కల్పన జత చేసి మలచిన ఈ సినిమా ఎందుకు ఇంతకాలం ఆదరణ పొందుతూ ఉందంటే అది ఎప్పుడూ ఒకేలా ఉండే మానవ స్వభావాలను చిత్రించింది కనుక. నేడు ఎదురుపడే మనుషులు ఎలా ఉంటారో ఈ సినిమాలో పాత్రలు అలా ఉంటాయి. అందుకే వాటితో తమను తాము ఐడెంటిఫై చేసుకున్న ప్రేక్షకులు ఎన్నో పాఠాలు నేర్చుకుంటారు. అర్థం చేసుకుంటారు. పిల్లలకు ఈ సినిమా గొప్ప వినోదంగా ప్రారంభమవుతుంది. ఐదేళ్ల వయసు పిల్లల నుంచి ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. చూసేకొద్దీ ఎదిగే కొద్దీ వారికి సినిమా కొత్తగా అర్థమై మరింతగా నచ్చుతుంది. ఈ సినిమాకు ఫ్యాన్స్ అయిపోతారు. అలా తరతరాలుగా ఫ్యాన్స్ అయ్యేలా చేసుకుందీ సినిమా. గతంలో ప్రతి వేసవిలో ఈ సినిమా రీరిలీజ్ అయ్యేది. ఇప్పుడు ఓటీటీల్లో... యూట్యూబ్‌లో కలర్‌లో ఉంది. పిల్లలతో ఒకటికి రెండుసార్లు చూసి వారికి చెప్పాల్సిన పాఠాలు చాలానే ఉంటాయి.

1. బాల అభిమన్యు తన విలువిద్య గురించి ఇలా అంటాడు: అత్తయ్యా... నువ్వు జడవకుండా నుంచో... నీ ముక్కుకు తగలకుండా నత్తును కొడతాను.
పిల్లలకు చెప్పాలి: నత్తు అంటే ముక్కుకు పెట్టుకునే ఆభరణం. విలువిద్య నేర్చుకుని ఎవరైనా సరే పండునో కాయనో కొట్టగలరు... కాని ముక్కుకు తగలకుండా నత్తును కొడతాననంటున్నాడంటే విలువిద్య చాలా గొప్పగా నేర్చుకున్నాడన్న మాట. మనం చదివినా, ఆటల్లో ప్రవేశించినా, కళల్లో ఉన్నా ఆ స్థాయి పరిణితి సాధించాలి. అభిమన్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి.

2. శ్రీకృష్ణుడు 'సత్యపీఠం' తీసుకువస్తాడు. అలాగే 'ప్రియదర్శిని' కూడా చూపిస్తాడు.
పిల్లలకు చెప్పాలి 'సత్యపీఠం' ఆనాటి లై డిటెక్టర్. మన పూర్వీకులు శాస్త్రపరంగా గొప్ప ప్రయోగాలు చేశారు. ఊహలు చేశారు. శాస్త్రజ్ఞుల ఊహలో లేని కాలంలో 'సత్యపీఠం' ఊహ చేయడం మనవారి గొప్పతనం. అలాగే వీడియో కాల్ చేసుకునేలా ల్యాప్‌టాప్ లాంటి 'ప్రియదర్శిని'ని చూపించారు. సైన్స్ దృష్టి కోణం నుంచి పురాణాలు చూస్తే చాలా ఇంటెరెస్టింగ్ విషయాలు తెలుస్తాయని చెప్పాలి.

3. శకుని పాచికలు వేస్తూ అంటాడు: ఈ పాచికలతో ఎవరినైనా సర్వనాశనం చేయగలను.
పిల్లలకు చెప్పాలి: జూదం వ్యసనం. అందులో మోసం ఉంటుంది. నష్టం ఉంటుంది. ఒక్కసారి వ్యసనాల్లో దిగితే తిరిగి రావడం కష్టం. నేటి రోజుల్లో ఆన్‌లైన్ గేమింగ్ కూడా అలాంటి వ్యసనమే. బెట్టింగ్ యాప్‌లు కూడా వ్యసనమే. ఆల్కహాల్, డ్రగ్స్ కూడా వ్యసనాలే. వ్యసనాల వల్ల పాండవులు రాజ్యాలను కోల్పోయారు. అందువల్ల ఎప్పుడూ వ్యసనాల జోలికి పోకూడదు.

4. శర్మ, శాస్త్రి వచ్చి లక్ష్మణ కుమారుణ్ణి పొగుడుతూ 'పురోగమించుట వారికి తెలుసు... తిరోగమించుట తమకు తెలుసు' అంటారు.
పిల్లలకు చెప్పాలి: గొప్పలు చెప్పుకోవడం, పొగడ్తలకు పడిపోవడం అల్పుల లక్షణం అని, లక్ష్మణ కుమారుడు అలాంటి వాడని చెప్పాలి. మనకు ఎంత ప్రతిభ ఉన్నా గొప్పలు చెప్పుకోకూడదని నేర్పాలి. లేని ప్రతిభ ఉన్నట్టుగా కల్పించి చెప్పి అభాసుపాలు కాకూడదని చెప్పాలి. మన బలహీనతను వాడుకుంటూ కొందరు చుట్టూ చేరి మోసం చేసి పబ్బం గడుపుతారనీ అలాంటి వారిని గుర్తించి దూరం ఉండాలి చెప్పాలి.

5. రాజ్యం పోయాక సుభద్ర వస్తే బలరాముని ఇంట్లో పరాభవం
పిల్లలకు చెప్పాలి: కొందరు మనుషులు అభిమానాన్ని బట్టి గాక స్థితిని బట్టి గౌరవిస్తారని, మనం కష్టంలో ఉంటే వారు అసలు రూపు చూపిస్తారని అలాంటి వారిని చూసి జాలి పడాలి తప్ప బాధ పడకూడదని నేర్పాలి. డబ్బుకు అతీతమైన విద్యాబుద్ధులు, వ్యక్తిత్వం శాశ్వతమని, వాటికే లోకంలో విలువ, గౌరవం అని చెప్పాలి.



6. ఘటోత్కచుడి ప్రవేశం
పిల్లలకు చెప్పాలి: మన దేశంలో అడవుల్లో జీవించేవారు ఉంటారని వారిని గిరిజనులు, ఆదివాసీలు అంటారనీ వారి కట్టు, బొట్టు, భాష, యాస, ఆచారాలు వేరని... మనం నాగరికులం అయినంత మాత్రాన వారిని చిన్నచూపు చూడకూడదని. వారెంతో మంచి వారని, అడవులు వారి ఆధారం అని వాటిని నరికి లాక్కుని వారికి హాని కలిగించడం తప్పు అని నేర్పాలి. 'అస్మదీయులు' అంటే ఫ్రెండ్స్ అనీ, ఆదివాసీలకు మనం అస్మదీయులుగా ఉండాలని చెప్పాలి.

7. దుష్ట చతుష్టయం
పిల్లలకు చెప్పాలి: దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు... వీరు నలుగురిని దుష్ట చతుష్టయం అంటారని చతుష్టయం అంటే నాలుగు అని చెప్పాలి. చెడు ఆలోచనలు చేసేవారితో స్నేహం చేస్తే మనం కూడా చెడ్డవాళ్లం అవుతామని చెడ్డపనులు చేయడం వల్ల ప్రమాదంలో పడతామని హెచ్చరించాలి.

8. గింబళి, గిల్పం కావాలని డిమాండ్
పిల్లలకు చెప్పాలి: స్నేహితులైనా, బంధువులైనా న్యాయమైన సాయం, కోరిక కోరితే నెరవేర్చాలని, అదే మన మంచితనం సాకుగా తీసుకుని గొంతెమ్మ కోరికలు కోరితే వారికి బుద్ధి చెప్పాలని నేర్పాలి. 'కంబళి', 'తల్పం' కాదని 'గింబళి', 'గిల్పం' కోరిన శర్మ, శాస్త్రులకు చిన్నమయ్య బుద్ధి చెప్పే దృశ్యాలు పిల్లలకు ఎంతగానో నవ్వు తెప్పిస్తాయి.

9. శాకంబరీదేవి ప్రసాదం- వివాహ భోజనంబు
పిల్లలకు చెప్పాలి: తెలుగువారి భోజనానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ప్రతి ప్రాంతానికీ సమూహాలకు వారివైన ఆహార అలవాట్లు ఉంటాయని, వాటిని గౌరవించాలని మన ఆహారపు అలవాట్లను పాటించాలని నేర్పించాలి. గోంగూరను శాకంబరీ దేవి ప్రసాదం అంటారని తెలుగువారికి గోంగూర ఇష్టమని చెప్పాలి. భక్ష్యాలు, చిత్రాన్నాలు, పానీయాలు, కూరగాయలు అంటే ఏమిటో వాటి తేడాలేమిటో చెప్పే సరదా పడతారు.

10. చినమాయను పెనుమాయ
పిల్లలకు చెప్పాలి: ఏ పనైనా నిజాయితీగా చేస్తే ఫలితం ఉంటుందని.. మాయతో కపటంతో శశిరేఖను లక్ష్మణ కుమారుడికి ఇచ్చి పెళ్లి చేయాలని కౌరవులు భావిస్తే శ్రీకృష్ణుడు, ఘటోత్కచుడు పెనుమాయతో ఆ పెళ్లిని పెటాకులు చేశారని... తగిన శాస్తి జరిగిందని... చెడ్డవాళ్లు ఎప్పటికీ ఓడిపోతారని, మంచితనంతో ఉంటేనే గెలుస్తామని బోధించాలి.

– కె.

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

శ్రమైక జీవనం



కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు... ఒంటి చేత్తో తోసిరాజని....
పనిలో తమను తాము నిరూపించుకున్నారు మహిళా కార్మికులు.
కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణగా నవీన శక్తిలా ముందుకు వచ్చారు మహిళా కార్మికులు.
శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతిబింబం అయ్యారు.
'ఈ రంగంలో మహిళలు పనిచేయలేరు' అనుకునే రంగాలలోకి వచ్చి అపోహలను బద్దలు కొట్టారు.
'పురుషులకు ఎక్కడా తీసిపోము' అని నిరూపించారు. నిరూపిస్తూనే ఉన్నారు. అయితే... ఇది నాణేనికి ఒక కోణం మాత్రమే. మరో కోణంలో చూస్తే మహిళా ఉద్యోగులు, కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.
కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య మన దేశంలో ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన చర్చను ముందుకు తెచ్చింది. వివిధ సర్వేల ప్రకారం మూడింట ఒకవంతు మంది మహిళలు పని ప్రాంతంలో ఏదో ఒక రకమైన శారీరక హింసను ఎదుర్కొంటున్నారు.
మహిళా సిబ్బందికి వారి పని ప్రాంతంలో ప్రమాదాలు పెరిగాయి. చాలా ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా లేదు. సరైన నిఘా, రిపోర్టింగ్ యంత్రాంగం లేకపోవడంతో అనుచిత ప్రవర్తన, వేధింపులు పెరిగాయి. ప్రాథమిక భద్రతా చర్యల గురించి చాలా సంస్థలలో మహిళా ఉద్యోగులకు అవగాహన కలిగించడం లేదు.
గార్మెంట్ ఫ్యాక్టరీలలో ఎక్కువమంది కార్మికులు మహిళలే. అయితే పురుషులతో పోల్చితే వారికి తక్కువ వేతనం ఇస్తున్నారు. వేతన అసమానతలతో పాటు పనిప్రాంతంలో ప్రమాదాలు, పురుషాధిపత్య వేధింపులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలలో మహిళాకార్మికులకు మౌలిక సదుపాయాల కొరత ఉంది.
'బిజినెస్ అండ్ హ్యూమన్ రైట్స్' రిపోర్ట్ మన దేశంలో గార్మెంట్ ఫ్యాక్టరీలలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చింది. నిజానికి 'ఇది కేవలం గార్మెంట్ పరిశ్రమలకు సంబంధించిన రిపోర్ట్ మాత్రమే' అనుకోనక్కర్లేదు. చిన్నా, పెద్ద తేడాలతో ఎన్నో పరిశ్రమలలో వేరు వేరు రూపాల్లో ఇదే పరిస్థితి ఉంది.
కోవిడ్ మహమ్మారి ఉమెన్ హెల్త్ వర్కర్‌లకు ప్రమాదాలు తెచ్చింది. విధి నిర్వహణలో చనిపోయిన వారు కూడా ఉన్నారు. అయినా వెనక్కి తగ్గలేదు.
నిరాశ పడే పరిస్థితులు రావచ్చు, భద్రతాపరమైన సమస్యలు ఉండవచ్చు....ఒకటి, రెండు అని కాదు....సవాలక్ష సమస్యలు ఎదురైనా మహిళా శ్రామిక శక్తి వెనక్కి తగ్గడం లేదు.
ఎందుకంటే వారు...
చరిత్ర వింటూ వచ్చారు.
మరో చరిత్ర నిర్మించాలనుకుంటున్నారు.